# ఎదురు గాలి

కృష్ణ ఇంటికి వచ్చేటప్పటికి, ప్రేమ వగలమారి వయ్యారిలా తయారైంది. అతనికి ఇష్టమైన బచ్చలిపండు రంగు చీర జాకెట్ కట్టుకుంది. తలనిండా మల్లెపూలు పెట్టుకుంది.

"త్వరగా తయారవండి, మంచి సినిమా ఈరోజే ఆఖరు రోజు వెళ్దాం".

"భలేవాడివోయ్ ఇంత అందమైన శిల్పం ఎదురుగా వుండగా వెధవ సినిమా, అప్టరాల్ బొమ్మలు చూడడానికి ఎందుకోయ్" అంటూ ఫోజుపెట్టి ప్రేమను ముద్దాడబోయాడు.

"ఛీ సిగ్గులేదు, కిటికీలోంచి అందరూ చూస్తారు".

"వాళ్ళకేం పనిలేదు. మనం లోపల ఏం చేసుకుంటున్నామో చూడటమే"

చాలాసేపు కృష్ణ, ప్రేమ సరసల్లాపాలు అయ్యేక....

నెమ్మదిగా ప్రేమ ప్రారంభించింది.

"నాలుగు రోజుల్లో నా బర్త్‌డేకదా! మరి మరి ఏం కొనిస్తారు?"

కృష్ణ గొంతులో పచ్చి వెలక్కాయ పడింది, అంతకు ముందుక్షణం వరకూ ప్రేమ ప్రేమైక కౌగిలిలో మధురానుభూతుల్ని పొందేడు.

"ఏం కావాలి" ఎలాగో అన్నాడు.

"బజార్లో గ్రాండ్ బోంబే బజార్ చీరల ఎగ్జిబిషన్ వచ్చింది. అక్కడ రెండువందల చీర వంద రూపాయలకే. ఎన్నాళ్ళనుంచో నేను సిల్క్ బ్రౌజ్ చీర కొనుక్కోవాలనుకుంటున్నాను కొనిపెట్టరా"

వల వేస్తుంది ప్రేమ గారాలుపోతోంది.

ఒకప్రక్క ప్రేమ కోరిక తీర్చాలని వున్నా మరోప్రక్క తనఆర్థిక పరిస్థితి తనను ఆ పని చేయనిస్తుందా? అని పైగా రేఖ ఆడాళ్ళు ఒక

చీరతో సరిపెట్టరు, కనీసం నాలుగైనా తీసుకుంటారు, కృష్ణ ఆలోచనలో పడ్డాడు.

"ఏమిటాలోచిస్తున్నారు? చీర అంటే చాలు మీ మగాళ్ళు ఒకటే ఆలోచిస్తుంటారు"

"కొందామోయ్. నీకు ఏం కావాలంటే అదే కొంటాను. నీకన్నా నాకు ఈ ప్రపంచంలో ప్రియమైనదేముంది?

"చీరలు ప్రియమైనవే సుమండీ" అంది ప్రేమ.

ఇద్దరూ నవ్వుకున్నారు.

మర్నాడు

ఆఫీసుకువెళ్ళే సమయంలో—

"సాయంత్రం గంట పర్మిషన్‌పెట్టి రండి షాపింగ్‌కి వెళదాం" అంది ప్రేమ.

ఆఫీసుకు వెళ్ళినప్పటినుంచీ ఆ రోజు చీరెకొనే ప్రమాదం నుంచి ఎలా బయటపడాలా అని ఆలోచిస్తూనే వున్నాడు.

ఇద్దరి ముగ్గురి దగ్గర ఆడాళ్ళు అడిగినదల్లా కొనకూడదు. అలా కొంటే మీదకు ఎక్కుతారని కూడా ఉపన్యాసం గూడ దంచేడు. సాయంత్రం కావాలని ఆలస్యంగా ఇంటికి వచ్చేడు.

లోపల భార్య సత్యభామ పోజులో వుంది.

కొంప మునిగింది.

ఈ రోజు పస్తు అనుకుంటాను.

గాలి ఇలా తిరుగుతుందనుకోలేదు.

"మైడియర్ లవ్ ఏమయింది?"

"దగ్గరకు రాకండి, నన్ను ముట్టుకోకండి"

"శ్రీకృష్ణుణ్ని సత్యభామ తన్నినట్లు, నువ్వు కాళ్ళతోనే కాకుండా

చేతులతో కూడా కొట్టు, చితకకొట్టు" అని బ్రతిమిలాడేడు కృష్ణ.

"ఆడదంటే మొదటినుంచీ మగవాళ్ళకు అలుసే, కౌగిట్లో వున్నంత సేపూ నీ వొంటినిండా బంగారు తొడుగు వేయిస్తాను అంటారు ఆ కాస్తా అయ్యాక పురుగులా చూస్తారు. మీ మగజాతిని నమ్మడానికి వీలులేదు".

ప్రేమ ముక్కు చీదుకుంటూంది.

కళ్ళు తుడుచుకుంటూంది.

కొంచంసేపు ప్రేమను ఏడ్వనిచ్చి-

"మైడియర్ క్వీన్. నీకు ఏం కావాలంటే అది కొనిస్తాను కాని వూరుకోవూ".

"ఏం కావాలంటే అది కొనిస్తారా?"

"సరే".

"ఎన్ని చీరలైనా కొంటారా?"

"సరేనా. లేచి తయారవు."

"మీరు అలా అంటారని నాకు ముందే తెలుసు. సాయంత్రం బజారుకు వెళ్ళాను. చీరలు చూస్తుంటే మీ స్నేహితుడు రాముం కనపడ్డాడు. చీరల షాపువాడు నాకు తెలుసు. నెమ్మదిగా డబ్బు ఇవ్వచ్చును, మీ కెన్ని చీరలు కావాలంటే అన్ని చీరలు తీసుకోండి" అన్నాడు. నాలుగు చీరలు తీసుకున్నాను.

"మొత్తం ఎంతయింది?" డాక్టరు దగ్గర బిల్లు ఎంతయింది సార్! అని దీనంగా అడిగే పేషెంట్‌లా.

"ఎంతోనా అయిదొందలే".

తన ఫ్రెండ్ రాము తన పాలిట రావణాసురుడిలా కనిపించాడు కృష్ణ మదిలో.

క్రిందపడ్డ కృష్ణను లేవనెత్తుతూ "ఏమయిందండీ" అంటూంది ప్రేమ.

—0—